

కేటీఆర్‌కు గ్రంథాలు అందజేస్తున్న హిందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు

కేటీఆర్‌కు భగవద్గీత గ్రంథాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 13: భగవద్గీత ప్రచారంలో భాగంగా ఆచార్య ప్రభోధానంద రచించిన గ్రంథాలను ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక సభ్యులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గురువారం కలిసి బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో అందజేశారు. భగవద్గీతలోని జ్ఞానాన్ని అందరికీ చేరవేయాలనే లక్ష్యంతో సాధారణ ప్రజలకు కూడా అర్థమయ్యే రీతిలో మూడు గ్రంథాలను రూపొందించామని సేవా సమితి కమిటీ సభ్యులు మంతటి వెంకటయ్య తెలిపారు.



గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న పీఎల్ శ్రీనివాస్

యువత వివేకానంద కలలను సాకారం చేయాలి

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 13: యువత స్వామి వివేకానంద సైనికులుగా మారి, దేశాన్ని ప్రేమిస్తూ ఆయన కలలను సాకారం చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. మహబూబ్ కాలేజ్ ఆవరణలోని ఎస్వీఐటీ ఆడిటోరియంలో మహబూబ్ కాలేజ్ ఎడ్యుకేషనల్ సొసైటీ, రామకృష్ణ మఠం సంయుక్త ఆధ్వర్యంలో 'వివేకానంద దివస్' కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరై కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, స్వామి వివేకానంద హైదరాబాద్ పర్యటన సనాతన ధర్మ చరిత్రలో, రామకృష్ణ మిషన్ చరిత్రలో మైలు రాయిగా నిలుస్తుందన్నారు. స్వామి వివేకానంద తొలి శంఖారావం మన భాగ్యనగరంలోనే అని అన్నారు. అమెరికా చికాగోలో జరిగిన విశ్వమత సభలో స్వామి వివేకానంద ప్రసంగానికి నాంది మహబూబ్ కాలేజీలో చేసిన ప్రసంగమని గవర్నర్ చెప్పారు. చికాగో ప్రసంగంలో వేదాలు, పురాణాలు, అనుష్ఠాన వేదాంతం గురించి స్వామి వివేకానంద చెప్పారని, ఇనుప కండలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన యువత భారత్‌ను విశ్వ గురువుగా చేయగలరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం, రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ, స్వామి వివేకానంద బోధనలు చదవితే ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తి వస్తుందని తెలిపారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత నిర్భయత్వం, త్యాగగుణం అలవర్చుకోవాలని ఆయన సూచించారు. సైనిక్ పురి భవన్స్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురి ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ పీఎల్ శ్రీనివాస్, ఎస్వీఐటీ కళాశాల చైర్మన్ ప్రేమ్ నారాయణ, వైస్ చైర్మన్, నరేశ్, సెక్రటరీ భగవత్ వారణాసి, వినోద్ పాల్గొన్నారు.

కేసీఆర్ స్ఫూర్తితో మొక్కలు నాటుదాం

ఘట్ కేసర్ బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్

ఘట్ కేసర్, ఫిబ్రవరి 13: తెలంగాణ సాధనకర్త, బంగారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు మూడు మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు ఉజ్వల భవిష్యత్తును అందించాలని ఘట్ కేసర్ బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పుట్టినరోజు సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు గ్రీన్ ఛాలెంజ్ అధినేత జోగినపల్లి సంతోష్ విసిరిన చాలెంజ్‌ను ఘట్ కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఛాలెంజ్ స్వీకరించి గురువారం మొక్కలు నాటారు. బంగారు తెలంగాణ సాధన కర్త కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం పురస్కరించుకుని భారతదేశ వ్యాప్తంగా సంతోష్ చేపట్టిన గ్రీన్ ఛాలెంజ్ ను ప్రతి ఒక్కరు స్వీకరించాలన్నారు. ప్రతి ఒక్కరు మూడు మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. జోగినపల్లి సంతోష్ ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్ రెడ్డి, బండారి ఆంజనేయులు గౌడ్, మాజీ ఎంపీటీసీ చిలుకూరి గోపాల్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు అబ్దుల్ అజీజ్, దేవరకొండ రాజా చారి, బిజిలి సదానంద్, ఎండి నజీర్, అబ్బగోని నాగరాజు గౌడ్, బానుక నవీన్, లక్ష్మయ్య, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ ఎండి సిరాజ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘట్ కేసర్ లో మొక్కలు నాటుతున్న మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాధవరెడ్డి తదితరులు

ఎన్‌డీపీఎల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి

రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ సమీక్షా సమావేశంలో డీసీ పి.దశరథ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ అన్నారు. నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో గురువారం జరిగిన రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం వల్ల రాష్ట్ర ఖజానాకు గండిపడుతుందని, దీనిని అరికట్టినప్పుడే మన వద్ద లిక్కర్ సేల్స్ పెరుగుతాయన్నారు. ఎన్‌డీపీఎల్‌తో పాటు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలపై కూడా నిఘా పెంచాలని సూచించారు. ఆయా ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో పట్టుబడి, నిల్వ ఉన్న గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వెంటనే డిస్పోజల్ కమిటీ అనుమతి తీసుకుని దహనం చేయాలన్నారు. అంతే కాకుండా జిల్లా పరిధిలోని పల్లు ఎక్సైజ్ స్టేషన్లలో పేరుకుపోయిన వాహనాలను సైతం సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చి, వేలం పెట్టాలన్నారు. గడిచిన నెల రోజుల్లో రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ వ్యాప్తంగా అబ్కారీ నేరాలకు సంబంధించి మొత్తం 197 కేసులు నమోదవగా, 149 మందిని అరెస్టు చేశామని, 7,904 కిలోల బెల్లం, 40 కిలోల అల్లం, 81.72 కిలోల గంజాయి, ఇతర డ్రగ్స్‌ను పట్టుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరును డీసీ అభినందించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వలారెడ్డి, ఫయాజుద్దీన్, నవీన్, విజయ భాస్కర్‌లతో పాటు ఏఈఎస్, ఎస్‌హెచ్ ఓలు, ఎస్ఐ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులను వేగవంతంగా పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ జీ ముకుందరెడ్డి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ పీవోఏ యాక్ట్ కింద నమోదైన పలు కేసులను వేగవంతంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ జీ ముకుందరెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, పీవోఏ యాక్ట్ కింద నమోదైన కేసులపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు లేవనెత్తిన అంశాలు, బాధితులు లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. బాధితులను ఇబ్బందులకు గురిచేయకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేసి పరిష్కారం చూపాలన్నారు. ఆలస్యమైతే నిందితులు బాధితులను భయపెట్టే అవకాశం ఉంటుందని, కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి ఛార్జిషీట్ నమోదు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, కమిటీ సభ్యులు రాంప్రసాద్, ఇటిక గోపి, సుదర్శన్ బాబు, పులి కల్పన, వెంకటేశ్వరరావు, అడిషనల్ డీసీపీ మనోహర్, సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్ కోటజీ, ఆర్డీవోలు సాయిరాం, రామకృష్ణ, ఏసీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక

ఎర్రవల్లి నివాసంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా గురువారం కలిసిన డా. దూదిమెట్ల బాలరాజు యాదవ్

చిన జీయర్ స్వామిని కలిసి తీర్థ ప్రసాదం స్వీకరిస్తున్న మాజీ మంత్రి హరీశ్ రావు

చిన జీయర్ స్వామిని కలిసిన హరీశ్ రావు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 12: సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో సమతా కుంభ్ 2025 జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా, ఇది, 108 దివ్య దేశాలలోనూ జరుగుతున్న నేపథ్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు సమతా మూర్తి క్షత్రాన్ని గురువారం సందర్శించి చిన జీయర్ స్వామి వారి ఆశీస్సులు స్వీకరించారు. స్థానికి యాగశాలకు వచ్చి అర్చకులతో కంకణధారణ చేయించుకున్నారు. దీంతో పాటు తీర్థగోష్ఠిలో పాల్గొన్నారు. భక్తులతో కలిసి స్వామి వారి నుంచి తీర్థం స్వీకరించారు. అనంతనం, ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ శివారులోని ముచ్చింతల్‌లో సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని నిర్మించి పర్యాటక కేంద్రంగా మార్చారని గుర్తు చేశారు. ఆయనతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

బాల రాముడి సన్నిధిలో మర్రి దంపతులు

అయోధ్యలోని బాల రాముని దర్శనం చేసుకున్న ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, కుటుంబ సభ్యులు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 13: మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, సతీమణి మర్రి మమతా రెడ్డి, కుమారుడు ధీరేన్ రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గారితో కలిసి అయోధ్య బాల రాముడి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలతో పాటు మల్కాజిగిరి నియోజక వర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ శ్రీరాముని కోరుకున్నారు.

అకారణంగా విద్యార్థిని తొలగిస్తారా?

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 13: సికింద్రాబాద్‌లోని అవినాష్ కళాశాల ఎదురుగా విద్యార్థి సంఘాల నాయకులు గురువారం ఆందోళనకు దిగారు. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ క్రికెట్ మైదానంలో ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో రాహుల్ అనే విద్యార్థిని కళాశాల యాజమాన్యం తొలగించినది. అకారణంగా రాహుల్‌ను కళాశాల నుంచి తొలగించారని కళాశాల ఎదురుగా బీఆర్ఎస్వీ, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ కళాశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. బౌన్సర్లతో కళాశాలను నడిపించడం.. ఇదెక్కడి సంస్కృతి అని, నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేయడం దారుణమన్నారు. కాలేజీ నుంచి బహిష్కరింపబడిన దళిత విద్యార్థి రాహుల్‌కు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. దీనిపై కళాశాల యజమాన్యం స్పందించి వెంటనే విద్యార్థి రాహుల్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి పరిషత్ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలు, నాయకులు పాండు రంగ్, గౌతమ్, మహేశ్, ప్రణయ్, హరీశ్, ఆకాష్, అభి, నందు, కిషోర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాటారు దశరథ్, రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, నగర అధ్యక్షు క్రాంతి, చంద్రకాంత్, నాగేందర్ పాల్గొన్నారు.

అవినాష్ కళాశాల ఎదురుగా ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

నేడు అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళనలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి13: తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రతో వర్గీకరణ చేసి మాలలకు తీరని ద్రోహం తల పెట్టిందని, కాంగ్రెస్ పార్టీ మాలలకు చేసిన ద్రోహాన్ని నిరసిస్తూ ఈ నెల 14న ట్యాంక్‌బండ్‌పై గల అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, జాతీయ కమిటీ గౌరవ అధ్యక్షుడు సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ, ఎస్సీ జాబితాలోని 57 కులాలకు రిజర్వేషన్ అవకాశాలు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మెజార్టీ దళిత కుటుంబాలకు అన్యాయం చేశారని ఆరోపించారు. మాలలను తక్కువ జనాభాగా చూపించి ఐదు శాతం రిజర్వేషన్లు కేటాయించి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. మాలలకు జరిగిన అన్యాయాలపై రిజర్వేషన్ హక్కుల కోసం పెద్ద పోరాటాలు, తిరుగుబాటు చేసి సాధించుకోకపోతే జాతికి బానిసత్వం తప్పదన్నారు. ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మాల జాతి బిడ్డలు, మాల మహానాడు సంఘాలు, మహిళా విభాగాలు భారీగా పాల్గొని వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత బహుజన పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు.

వడ్లమూరి కృష్ణస్వరూప్

డాక్టర్ ప్రసన్న మండవకు ఎడ్యుకేషనల్ అవార్డు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి13, (నమస్తే తెలంగాణ): ఓట్రస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఎండీ డాక్టర్ ప్రసన్న మండవ విద్యారంగంలో చేస్తున్న విస్తృత సేవలకు గుర్తింపు గాను 'సీఐటీడీ గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రేడ్ ప్రమోషన్ అవార్డు-2025' ను అందుకున్నారు. సోమాజీగూడలోని ఓ ప్రైవేట్ హోటల్ జరిగిన సీఐటీడీ 50వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డును ప్రసన్నకు అందించారు.

భవిష్యత్ తరాలకు సరిపడేలా పౌల్ట్రీ ఉండాలి

జాతీయ పౌల్ట్రీ రీసెర్చ్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలలో ఐసీఏఆర్ డీడీజీ డా. రాఘవేంద్ర భట్టు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 13: దేశ జనాభా పెరుగుదల కనుగుణంగా, భవిష్యత్ తరాలకు అవసరమైయ్యేలా పౌల్ట్రీనీ పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీఏఆర్-పౌల్ట్రీ రీసెర్చ్ న్యూఢిల్లీ డీడీజీ డా. రాఘవేంద్ర భట్టు అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఐసీఏఆర్-డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రధాన కార్యాలయం సమావేశపు మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు రాఘవేంద్ర భట్టు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా గుర్తింపు గల హైదరాబాద్ పౌల్ట్రీ కేంద్రం 50 వసంతాల సందర్భంగా, అనేక మార్పులకు నాందిగా నిలిచిందన్నారు. దేశంలో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పౌల్ట్రీ పరిశ్రమలో మార్పులు తీసుకు రావడంలో శాస్త్ర, పరిశోధన, విద్యా, విస్తరణలో విప్లవాత్మక మార్పు తీసుకు రావడంలో మనందరి కృషి ఉందని గుర్తుచేశారు. రానున్న తరాలకు నాణ్యత గల పౌల్ట్రీ కొరకు మరిన్ని పరిశోధనలు అవసరమన్నారు. దక్షిణ భారతంలో ప్రధానంగా హైదరాబాద్ పౌల్ట్రీ పరిశోధనలకు కేంద్రంగా నిలిచిందన్నారు. దేశంలో పలు చోట్ల పౌల్ట్రీ నష్టాల బారిన పడ్డ వెంటనే పునరాలోచించి , ఎందుకు జరిగాయే ఇక్కడ పరిశోధనలు జరిగి ప్రత్యామ్నాయ కనుగొన్నారని పేర్కొన్నారు. పౌల్ట్రీ ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా లక్షల కుటుంబాలు ఉపాధి పొందుతున్నారని గుర్తుచేశారు. పౌల్ట్రీ ద్వారా ఎగుమతులకు మంచి అవకాశం ఉందన్నారు. దేశంలో ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో అధిక శాతం వ్యవసాయ, ఇంటి వద్దే కాకుండా ప్రరిశ్రమలుగా వెలిశాయన్నారు. ప్రధానంగా పౌల్ట్రీ అధికంగా పెంచే అవకాశాలున్నాయన్నారు. దేశంలోని ఎఐసీఆర్‌పీ సెంటర్స్ కేవీఏఎఫ్ఎస్‌యూ బెంగళూర్, జీఏడీవీఏఎస్‌యూ లుధ్ధీనా, ఓయూఏటీ భువనేశ్వర్, బీఏయూ రాంచి, ఎంపీయూఏటీ ఉదయ్‌పూర్, బీఏఎస్‌యూ పాట్న, ఐసీఏఎన్ఓఎఫ్ఆర్ఐ సిక్కిం, ఐసీఏఆర్ సీసీఏఆర్ఐ గోవా, డబ్ల్యూబీయూఏఎఫ్ ఎస్ కోల్‌కత్తాతో పాటు మొత్తం 24 సెంటర్లలో ఎప్పటికప్పుడు పరిశోధనలు జరిగాయన్నారు. ఈ సెంటర్లు పౌల్ట్రీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయన్నారు. ప్రతి ఏడాది 12,330 రైతు కుటుంబాలు కోళ్ల పెంపకం ద్వారా లబ్ధి పొందుతున్నాయన్నారు. ప్రతి ఏడాది 32 మిలియన్ల గుడ్లు విక్రయిస్తున్నారని సూచించారు. మంచి నాణ్యత గల వాటిని పెంచి ఎగుమతులు చేపడితే మంచి లాభాలు పొందే అవకాశాలున్నాయన్నారు. రాజేంద్రనగర్ రీసెర్చ్ కేంద్రం డైరెక్టర్ డా. ఆర్.ఎన్, చట్టర్జీ, పౌల్ట్రీ బ్రీడింగ్ విభాగం ఏజీబీ హెడ్ డా. రాజ్ కుమార్ మాట్లాడుతూ, కరోనా వంటి గడ్డు కాలంలో కూడా గుడ్డుకు అధిక ప్రాధాన్యత ఉన్నదన్నారు. రాజేంద్రనగర్ కోళ్ల పరిశోధనా సంచాలనాలయం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో గుడ్లు, మాంసం కొరకు విడుదల చేసిన శ్రీనిధి, పెరటి దొడ్లలో పెంచడానికి వనరాజ, రంగురంగుల బ్రాయిలర్ కోడిగా కృషిబ్రో, పెరటిలోనే అధిక గుడ్ల ఉత్పత్తి దేశీయ కోళ్లుగా ఏడాదికి అధిక గుడ్లు వనశ్రీ, ఐదు నెలల్లో ఏడాదికి అధిక గుడ్లు పెట్టే అసీల్, కడక్‌నాథ్, ఘాగస్, నికోభరి రకాలను విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఆర్పీ శర్మ, డా.ప్రసాద్, రాజశేఖర్ రెడ్డి, మైపాల్ రెడ్డి, డా.ప్రకాశ్ పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రతినిధులు, రైతులు, శాస్త్రవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని సుదీర్ఘ చర్చ జరిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీడీజీ డా. రాఘవేంద్ర భట్టు

ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం

మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య

ఖైరతాబాద్: ఎస్సీ వర్గీకరణ చేసి, మాలలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలను అశాస్త్రీయంగా వర్గీకరణ చేసిందన్నారు. అంబేద్కర్ వారసులైన మహార్, మాల, నేతకాని కులస్తుల మధ్య మాజీ ఎంపీ, బీజేపీ నేత వెంకటేశ్ చిచ్చు పెట్టే చర్యలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలను రీసర్వే చేసినట్లు ఎస్సీల జనాభాను సైతం రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో లక్షాలాది మందితో హైదరబాద్ లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాల సంఘాల జేఏసీ కో చైర్మన్లు బూర్గుల వెంటేశ్వర్లు, గోపోజు రమేశ్, మన్నె శ్రీధర్‌రావు, భాను, ఆనంద్, సరళ, అంజలి పాల్గొన్నారు

బీసీల పోరాటాల ఫలితంతోనే.. కుల గణన రీ సర్వే

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, ఫిబ్రవరి 13: తెలంగాణ బీసీల పోరాట ఫలితంతోనే ప్రభుత్వం దిగివచ్చి కుల గణనకు రీ సర్వే చేయాలని అంగీకరించిందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్త చేశారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, అవినాశ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ అభినందన హోటల్‌లో బీసీ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ మహిళా విభాగం వర్కింగ్ ప్రసిడెంట్‌గా పెద్దిగారి సంగీతను నియమిస్తూ, ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఇందుకు ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి, అసెంబ్లీలో బిల్లు పెట్టి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న తెలంగాణ బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ.20 వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 25న బెంగళూర్‌లో ఓబీసీ జాతీయ సెమినార్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం ప్రకటించిన కుల గణన రీ సర్వేను ఆన్‌లైన్‌లో కాకుండా ప్రభుత్వ యంత్రాంగం ఇంటింటికీ వెళ్లి పూర్తిస్థాయిలో సేకరించినప్పుడే రీ సర్వే విజయవంతం అవుతుందని సూచించారు. కార్యక్రమంలో శంకర్, నీల వెంకటేశ్, సుధాకర్, ఉదయ్‌నేత, నందగోపాల్, వేముల రామకృష్ణ, సతీశ్, రాజునేత, ప్రీతమ్, జోషి, రాందేవ్ మోడి, దేవేంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, పాల్గొన్న కన్వీనర్ గుజ్జ కృష్ణ

నిర్మానుష్యంగా గచ్చిబౌలి రహదారి

నగరంలో రోజు రోజుకు వేసవి తాపం అధికమవుతోంది. ఫిబ్రవరి మాసమే అయినప్పటికీ ఎండ తాకిడి పెరగడంతో అప్పుడే చలి వేంద్రాలు రహదారుల వెంట ఏర్పడ్డాయి. బాటసారులకు దాహం వేస్తే దప్పిక తీర్చుకునేలా చల్లని కుళాయిలను ఏర్పాటు చేశారు.

ల్యాంకోహిల్స్ వద్ద చలి వేంద్రం